TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

సంపుటి : 01 సంచిక : 294 | మంగళవారం జూలై 01 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

## పాశమైలారం ప్రమాద ఘటన..
## ప్రభుత్వ కమిటీ ఏర్పాటు



హైదరాబాద్:
సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలో సహాయకచర్యల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో సభ్యులుగా డీఆర్ఎఫ్ స్పెషల్ సీఎస్, కార్మిక శాఖ సీఎస్‌ను నియమించారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను కమిటీ సిఫార్సు చేయనుంది.మరోవైపు క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సీఎం ఆరాతీస్తున్నారు. తాజా పరిస్థితులను మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం 10గంటలకు ఘటనాస్థలికి సీఎం వెళ్లనున్నారు.




మిగతాది 2లో

## లక్షల కోట్లు దోచుకుతిన్నారు..
## బీఆర్ఎస్ పై మంత్రి పొంగులేటి ఫైర్

వరంగల్:
ఖమ్మం జిల్లా నుంచి బీఆర్ఎస్ పార్టీ వాళ్లను అసెంబ్లీ గేటు తాకనీయనని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాగ్ధానం చేశార.. చెప్పినట్లే ఒక్క గులాబీ పార్టీ ఎమ్మెల్యేను గేటు తాకనీయలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో లక్షల కోట్లు అవినీతి చేశారని బీఆర్ఎస్ పై ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ వాళ్లకు పదవి లేకపోయే సరికి పేద ప్రజలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు.సోమవారం (జూన్ 30) పొంగులేటి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రాయపర్తి మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత కష్టం వచ్చినా పేదవాడి కలలను సహకారం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.



## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు..
## కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: హరీశ్‌రావు

హైదరాబాద్:
పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇది భారాస, తెలంగాణ ప్రజల పోరాట విజయమన్నారు. తెలంగాణ జలాలపై ఏపీ చేస్తున్న కుట్రలకు ఇదో చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిలిపివేసేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.





## పాశమైలారం
## కెమికల్ ఫ్యాక్టరీలో
# భారీ పేలుడు

**మంటలు చెలరేగి పదిమంది దుర్మరణం**

» వెంటనే సహాయక చర్యలకు దిగిన అధికారులు
» వివిధ ఆస్పత్రుల్లో క్షతగాత్రులకు చికిత్స

**సంగారెడ్డి,జూన్26:**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న సీగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో భారీ పేలుడు సంభవించడంతో పరిశ్రమ తునాతునకలైపోయింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9 గంటల సమయంలో సీగాచి కెమికల్స్‌లో పని సాగుతున్న సమయంలో రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి కంపెనీ షెడ్డు పూర్తిగా కూలిపోయింది. మంటలు తక్కువ సమయంలోనే పరిశ్రమ మొత్తం వ్యాపించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. అయినప్పటికీ, పలువురు కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు కార్మికులు మంటల్లో సజీవదహనమయ్యారు. మిగతా మృతుల మరణానికి తీవ్ర గాయాలు కారణమయ్యాయని తెలుస్తోంది. శిథిలాల కింద ఇంకా 15 మంది కార్మికులు చిక్కుకుపోయి ఉండొచ్చని అనుమానించడంవల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. గాయపడ్డ 38 మందిలో 20 మందిని చందానగర్ ప్రభుత్వాస్పత్రికి, మరో 18 మందిని ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే 8 ఫైరింజన్లు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. శిథిలాల తొలగింపునకు భారీ క్రేన్‌లు, హైడ్రా మిషన్‌లను రంగంలోకి దించారు.

మిగతాద్ది 2 లో




## ‘మీకో దండం..
## మీ పార్టీకో దండం’..
### బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల కల్లోలం రేపింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. చాలాకాలం తర్వాత బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయన.. కాసేపటికే ఈ ప్రకటన చేయడం గమనార్హం.

2 లో




## ఉచిత బస్సు పొందిన
# 191 కోట్ల మంది మహిళలు

» వారి ప్రయాణం విలువ రూ.6,300 కోట్లు
» మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్,జూన్ 30:
హైదరాబాద్ నగరంలో కొత్తకాలనీలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా కొత్త రూట్లలో ప్రయాణికుల సౌకర్యాలు పెంచేలా ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు ఆర్టీసి సిద్ధంగా ఉందన్నారు. ఒకే రూట్‌లో వెళ్లే వారుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారికి ప్రత్యేక బస్సులు వేస్తామని హామీ ఇచ్చారు.

2 లో

## పథకం ప్రకారమే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్:
పథకం ప్రకారమే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు జరుగుతోందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో కేసీఆర్, కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఏ విచారణ అధికారైనా వాళ్ల పేర్లు చెప్పారా? అని ప్రశ్నించారు.“ఫోన్ ట్యాప్ చేశారని ఎవరైనా ఫిర్యాదు చేశారా? ఊహించి రాసి.. ఇదే జర్నలిజం అంటే ఊరుకునేది లేదు. ఆధారాలు లేకుండా రాస్తే మా చర్యలు కఠినంగా ఉంటాయి. దుష్ప్రచారంపై కేసీఆర్ ఊరుకున్నా మేం ఊరుకోం. దేశంలో ఫోన్ ట్యాపింగ్ ఎక్కడా జరగడం లేదా? ఇప్పుడు ట్యాపింగ్ జరగట్లేదని సీఎం చెప్పగలరా?” అని జగదీశ్‌రెడ్డి అన్నారు.



## హైడ్రాపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,
మాదాపూర్ సున్నం చెరువు దగ్గర హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సోమవారం గరం అయ్యారు. చెరువును బఫర్ జోన్ చేయకుండానే కూల్చివేతలు చేపట్టారంటూ హైడ్రా అధికారులపై మండిపడ్డారాయన.



## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

- నక్సల్స్‌లో చర్చలు జరపాలంటే ప్రోత్సహించినట్లా
- అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్

హైదరాబాద్,జూన్ 30:
కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ..

2 లో

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ది లేదు



▸ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కవిత విమర్శలు
▸ 17న రైల్ రోకో కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్,జూన్ 30:
బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జూలై 17న రైల్ రోకో నిర్వహించిన తీరుతామని తేల్చిచెప్పారు.

# సంపాదకీయం

## నానాకాలం చదువులు



'వానాకాలం చదువు'లంటారు. ఇప్పటికీ దేశంలో చాలాచోట్ల వానకీ, చదువుకీ చుక్కెదురే. చెట్ల కిందో, అరుగుల మీదో, అంతంతమాత్రపు కప్పు కిందో బడులు నడిపేటప్పుడుబీ చక్కా నడిచి పోడానికి పక్కారోడ్లు లేనప్పుడు వానాకాలంలో చదువుకు గంట కొట్టి ఇంటికి పరిమితమవక తప్పదు. వెనకటి కాలంలో చదువు చెప్పే రోజులతో సమానంగా నిషేధించే రోజులూ ఉండేవి. అష్టమి, నవమి, చతుర్దశి, అమావాస్య, పౌర్ణమి మొదలైన తిథుల్లో, గ్రహణం పట్టినప్పుడూ అధ్యయనం కూడదు. వాటిని 'అనధ్యయన దినా'లనేవారు. వేదాలు, ఇతర రహస్య విద్యల వల్లింపైతే వర్షాకాలంలో పూర్తిగా నిషిద్ధం. నేర్చుకున్నది మాత్రం నెమరు వేసుకోవచ్చు. క్రమంగా కేలండర్ మారిపోయి వర్షర్తువూ, చదువుల ఋతువూ ఒకేసారి మొదలవడం ప్రారంభించాయి. మినహాయింపులున్నా ఆ రెంటి మధ్యా వైరుధ్యం పోయి సయోధ్య వెల్లివిరుస్తోంది. వానలతో పచ్చదనాన్ని తెచ్చుకుని కొత్త ఉత్సాహాన్ని నింపుకొనే ప్రకృతితో చదువుల ఋతువు పోటీపడుతూ రహదారులనూ, బడితావులనూ పిల్లల సందడితో వర్ణరంజితమూ, కర్ణరంజితమూ చేస్తోంది. మరోపక్క విచిత్రంగా ముల్లు ఈ కొస నుంచి పూర్తిగా దాని వ్యతిరేక దిశకు తిరగడమూ జరుగుతోంది. చదువుల అభావ దినాలు పోయి ఉల్బణ దినాలు వచ్చాయి. ఋతు నిర్బంధాలూ, తిథివార నిషేధాలూ పోయి చదువుల కేలండర్ 'సార్వకాలికత'ను తెచ్చుకుంటోంది. వానా కాలం చదువులు పోయి నానాకాలం చదువులొచ్చాయి. అది మరోరకం వైపరీత్యానికి దారి తీసింది. అంతటా కాకపోయినా, అనేక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో వేసవి సెలవులు కుదించుకుపోతున్నాయి. ప్రత్యేకించి పబ్లిక్ పరీక్షలు రాయబోయే పిల్లలకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ పైన వేసవి పొడవునా ట్యూషన్ తరగతులకు హాజరవడం అనివార్యమవుతోంది. భుజాలను వంచే పుస్తకాల బరువుకు తోడు మస్తకాలను భయాందోళనలతో నింపే చదువు బరువూ పెరిగిపోతోంది. 'స్కూలు వర్కు'ను మించి 'హోము వర్కు' నివ్వడంతో బడికీ, ఇంటికీ తేడా చెరిగిపోయి, వేరే వృత్తి ఉద్యోగాల్లో తలమునకలయ్యే తల్లితండ్రులే టీచర్లు గానూ మారి, అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. తల్లుల పరిస్థితి మరీ ఘోరం. ఉద్యోగానికి అదనంగా వంటపనీ, ఇంటిపనీ, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూనే ఉపాధ్యాయిని పాత్రనూ పోషించవలసి వస్తోంది. స్త్రీ, పురుష బాధ్యతల మధ్య అసమానతలు కొనసాగుతున్న పరిస్థితిలో గృహిణికి ఇదెంత భారమో ఊహించగలం. స్కూలు ఫీజులూ, ఇతరత్రా వసూళ్ల రూపంలో వేలు, లక్షలు ధారపోస్తున్నా తల్లితండ్రులకు 'టీచరీ' రూపంలో ఈ అదనపు చాకిరీ తప్పడం లేదు. ఆటపాటలతో సహా ఇతరేతర మానసికోల్లాసాలకు ఒకటి, రెండు గంటలైనా ఒత్తిడి లేని స్వేచ్ఛా సమయం చిక్కని పిల్లల పాలిట చదువు అక్షరాలా 'నిర్బంధ' విద్యే అవుతోంది. విద్యాసంస్థలు చదువు బరువు తగ్గించకుండానే అదనపు వేళల్లో ఆటపాటల బరువునూ మోపడంతో పిల్లలకసలే ఊపిరి సలపడం లేదు. దేశంలో విద్యాబోధన ఎంత శాస్త్రీయంగా జరుగుతోందో పట్టించుకునే వ్యవస్థ అసలేదైనా ఉందా, చదువులు పిల్లల శారీరక మానసిక వికాసానికేమైనా సాయపడు తున్నాయా అన్న ప్రశ్నలు తల్లితండ్రుల నుంచే ఎదురవుతున్నాయి. పరీక్షలలో సాధించాల్సిన మార్కుల గరిష్ఠ శాతం కూడా ఇప్పుడు మారిపోయింది. తదుపరి చదువుకు ఏ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలోనైనా సీటు రావడానికి డెబ్బై, ఎనభై శాతం మార్కులు కూడా సరిపోవడం లేదు, తొంభై శాతం దాటి తీరాల్సిందే. దాంతో పిల్లల్లో పోటీ, అసూయ, అలజడి, ఆందోళన, ఒత్తిడి పెరిగి పోతున్నాయి. తమ చదువూ, భవిష్యత్తుల గురించి తల్లితండ్రులు కనే కలల భారం పిల్లల కను రెప్పల మీద పడి వాళ్ళ నిద్రను హరిస్తోంది. పిల్లల్లో గ్రహణశక్తి, చురుకుదనం పెరిగిన మాట నిజమే కానీ, మొత్తంగా నేటి ఈ చదువుల తీరు ఆదర్శవంతమేనా అన్న సందేహం మాత్రం వదలకుండా వేధిస్తూనే ఉంది. ఇక చదువుల్లో రకరకాల అసమానతలు పెరగడమే తప్ప తగ్గుతున్న జాడలేదు. ఉజ్జ్వల భవిష్యత్తు వైపు నడిపించే చదువుల నిచ్చెనపై చివరి మెట్ల మీద చతికిల బడుతున్నవారు నేటికీ అసంఖ్యాకమే. ఇంకోవైపు నూటికి నూరుశాతం అక్షరాస్యతను సాధించడానికి ప్రభుత్వాలు ఇప్పటికీ ఆపసోపాలు పడుతూనే ఉన్నాయి. నూటయాభయ్యేళ్ళ క్రితం, బ్రిటిష్ వలస పాలన ప్రారంభం నాటికి మూడు శాతం పైచిలుకు ఉన్న అక్షరాస్యత ఇప్పుడు ఎనభై శాతానికి చేరడం, విడిగా చూసినప్పుడు ఒకింత ఊరటే కానీ, ఎన్నో దేశాలతో పోల్చితే ఈ పెరుగుదల వేగమూ, శాతమూ ఏమంత విశేషం కావని పెదవి విరిచేవారూ ఉన్నారు. ఇందులో మళ్ళీ ప్రాంతీయంగా, జెండర్ పరంగా అంతరాలూ యథాతథం. ఎప్పుడో కానీ సోదిలోకి రాని ఈశాన్య రాష్ట్రాలు అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉండటం ఒక విశేష మైతే, ఎంత ప్రామాణికమో తెలియదు కాని, బిహార్‌తో కలసి ఆంధ్రప్రదేశ్ ఆ పట్టికలో అడుగు బొడుగు స్థానాలలో కనిపించడం కలవరపరిచే విషయం. ఇక చదువుల నాణ్యత విషయానికొస్తే, పట్టికలో మన దేశం స్థానం ఉసూరుమనిపించే మరో అధ్యాయం. చదువుకీ, మంచి రాబడిగల ఉద్యోగాలకూ పీటముడి పడిన దశలో విద్యాభ్యాసం పూర్తిగా పరుగు పందెంగా మారి పిల్లల్ని విపరీత శ్రమకూ, అలసటకూ గురిచేస్తున్న మాట నిజం. చదువుల మరో పరమార్థమైన జ్ఞాన సముపార్జనకు కూడా పెద్ద పీట వేస్తూ ఎప్పటికది నిలకడ తెచ్చుకుంటుందో, పిల్లల్ని పరీక్షల భయతీరాన్ని దాటించి వైజ్ఞానికపు వెలుగుల ఉల్లాస తీరం వైపు నడిపిస్తుందో కాలమే తేల్చాలి.

## పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

మొదటిపేజీ తరువాయి
అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పూర్తిగా కూలిపోవడంతో సహాయక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ప్రాణాపాయంగా శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ భవనం నుంచి కేవలం ఆరుగురినే బయటకు తీయగలిగారు. కెమికల్ ఫ్యాక్టరీలో మంటలతో పాటు భారీగా విషవాయువులు విడుదలవడంతో పరిసర ప్రాంతాల్లో ఘాటైన వాసనలు వ్యాపించాయి. స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతూ తమ ఇళ్లలోకి చెదురుమదురుగా చేరుకున్నారు. అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి ఎవరూ రావొద్దని హెచ్చరించారు. ఈ పేలుడు ఘటన రాష్ట్రాన్ని దిగ్భ్రాం÷-రతికి గురిచేసింది. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్నదానిపై విచారణ కొనసాగుతోంది. శిథిలాల తొలగింపు తర్వాత అసలు ప్రమాద స్థాయి ఎంత పెద్దదో అర్థం కానుంది. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశ్రమ నుంచి ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగి పరిశ్రమలో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ప్రమాదంతో స్థానికులు, కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారిని అక్కడి నుంచి దూరంగా పంపించివేసారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సంఘటన స్థలానికి పఠాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మల్టీజోన్ టు ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పరితోష్ పంకజ్ చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

మొదటిపేజీ తరువాయి
రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా. కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు. వాళ్లు అనుకున్న వాళ్లకే పదవి ఇచ్చారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నా. రాష్ట్ర అధ్యక్షుడికి రాజీనామా లేఖ ఇవ్వడానికే వచ్చా. నాకు మద్దతుగా ముగ్గురు కౌన్సిల్ సభ్యులు కూడా రాజీనామా చేశారు. రాజాసింగ్ మా పార్టీ సింబల్ మీద గెలిచాడు ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యే కాదని, సస్పెండ్ చేయాలని కిషన్‌రెడ్డే స్పీకర్‌ను కోరాలి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడాం. కానీ, పార్టీ అధికారంలోకి రాకూడదనే ఎక్కువ మంది కోరుకుంటున్నారు. బీజేపీ కోసం సర్వం ధారపోశాను. నేను, నా కుటుంబం టెర్రరిస్టుల టార్గెట్‌లో ఉన్నాం. పార్టీ కోసం ఇంత పని చేసినా ఏం లాభం?. అందుకే పార్టీకి లవ్ లెటర్ ఇచ్చి వెళ్తున్నా. మీకో దండం.. మీ పార్టీకో దండం. లక్షల మంది కార్యకర్తల బాధను ప్రతిబింబించే రాజీనామా ఇది(అంటూ లేఖను చూపించారాయన). బీజేపీకి రాజీనామా చేసినా.. హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటాను అని రాజాసింగ్ ప్రకటించారు.

## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్టుల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్టుల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసేది' అంటూ ÷ర్ అయ్యారు. శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ÷ర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎ ల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను సోమవారంకాంగ్రెస్ నేతలు పరిశీలించారు. జూలై 4న ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం సభకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

## ఉచిత బస్సు పొందిన 191 కోట్ల మంది మహిళలు

మొదటిపేజీ తరువాయి
ఆర్టీసీలో ఇప్పటి వరకు 191 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, వారి ప్రయాణం విలువ రూ.6,300 కోట్లు ఉంటుందని మంత్రి తెలిపారు. ముషీరాబాద్‌లో పదవీవిరమణ పొందుతున్న 14 మంది ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవల్ని కొనియాడారు. అంతకుముందు అధునాతన టెక్నాలజీ ద్వారా ఆర్టీసీ అమలు చేస్తోన్న డిజిటల్ పేమెంట్స్ అమలును మంత్రి పొన్నం పరిశీలించారు. రవాణా శాఖ చెక్‌పోస్టుల మూసివేత అంశం కేంద్రం ప్రతిపాదనలో ఉందని, దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకొచ్చిందని, రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టులు సాంకేతికంగా అమలు చేసేలా మార్పులు చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో అనేక సంస్కరణలు, ఆర్టీసీ ఉద్యోగులకు సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ పాత బకాయిలు చెల్లిస్తూ, నూతన నియామకాలు చేపట్టామని, కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని వివరించారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు

మొదటిపేజీ తరువాయి
సోమవారం తన నివాసంలో సింగరేణి జాగృతి రూపొందించిన రైల్ రోకో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిసి సమాజం, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు వేర్వేరు బిల్లులు పాస్ చేసిందని గుర్తు చేశారు. ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించేందుకు వెంటనే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకే తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జూలై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన రైల్ రోకో చేసి తీరుతామని తెలిపారు. రైల్ రోకోకు సింగరేణి జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని వెల్లడించారు. బిసిల రిజర్వేషన్ల పెంపు, రైల్ రోకో అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. జూలై 16, 17, 18 తేదీల్లో ఎవరూ ప్రయాణాలు పెట్టుకోవద్దని ఎంఎల్‌సి కవిత మరోసారి విజ్ఞప్తి చేశారు. ÷ంగరేణి కాలరీస్ సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఎంఎల్‌సి కవిత డిమాండ్ చేశారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు సర్వేయర్ కోర్సు పూర్తి చేసి డిజిఎంఎస్ నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి సర్వేయర్ కోర్సు పూర్తి చేసిన వారి కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

## హైడ్రాపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
"చెరువులు కబ్జాకు గురికాకుండా అభివృద్ధి చేయాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన. కానీ, హైడ్రా తీరు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా ఉంది. హైడ్రా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. సున్నం చెరువు బఫర్ జోన్ చేయకుండా కూల్చివేతలు చేపట్టారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌ను కలుస్తా" అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఇదిలా ఉంటే.. సున్నం చెరువు హైడ్రా కూల్చివేతలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీశాయి. పలువురు ప్రొక్లెయిన్‌కు అడ్డం పడి హైడ్రా డౌన్ డౌన్.. హైడ్రా కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అన్యాయంగా తమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే అధికారులు మాత్రం భారీ బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగించారు.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు.. కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి
ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని తెలిపింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం అత్యవసరమని కమిటీ అభిప్రాయపడింది.

### కేంద్రం నిర్ణయం హర్షణీయం: కవిత

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి నిరాకరించడం హర్షణీయమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ నిర్ణయం తెలంగాణ జాగృతి, భారాస సాధించిన విజయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా తెలంగాణ ప్రయోజనాల కోసం పని చేయాలన్నారు. " బనకచర్లపై అపెక్స్ కౌన్సిల్ నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలి. రాష్ట్రానికి 968 టీఎంసీలను ప్రాజెక్టుల వారీగా కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలి" అని కవిత డిమాండ్ చేశారు.

## లక్షల కోట్లు దోచుకుతిన్నారు.. బీఆర్ఎస్ పై మంత్రి పొంగులేటి ఫైర్

మొదటిపేజీ తరువాయి
8 లక్షల కోట్లు అప్పు ఉన్న.. వాటికి మిత్తి కడుతూ పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తున్నామన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసిందని ఫైర్ అయ్యారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి విద్యకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా సన్న బియ్యం ఇవ్వడం లేదని.. దేశంలోనే ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. ఎన్నికల ఉన్నప్పుడే గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చిందని.. ఇందిరమ్మ రాజ్యంలో మాత్రం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకున్నా రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు వేశామని గుర్తు చేశారు. ధరణి పోర్టల్?ను బంగాళాఖాతంలో కలిపి రైతుల కోసం భూభారతి చట్టం తీసుకువచ్చి రైతులకు మేలు చేస్తున్నామని చెప్పారు. మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని తెలిపారు. పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## విధేయతకే బిజెపి పెద్దపీట

ఆంధ్రప్రదేశ్ బీజేపీకి కొత్త అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో, పార్టీ విధేయులకు బీజేపీ పెద్దపీట వేస్తోందని మరోసారి రుజువైంది.. దశాబ్దాలు తరబడి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు కట్టబెట్టుతోంది. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాల అధ్యక్షులను ఎంపిక చేసింది. రాష్ట్ర నేతలు ఒకటి తలిస్తే.. హైకమాండ్ మరొకటి చేస్తోంది. ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ అధ్యక్షుల ఎంపికలో వ్యూహాత్మకంగా వ్యవహరించింది. సీనియర్లు, ఆశావహులకు షాకిస్తూ.. కొత్త అధ్యక్షులను ఎంపిక చేసింది. ఇక్కడ మాధవ్, తెలంగాణలో రాంచంద్రరావులు ఇద్దరూ ఆదినుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. వివిధ హోదాల్లో పార్టీకి సేవలు అందించారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తండ్రి చలపతిరావు కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు. ఇప్పుడు మాధవ్ అధ్యక్ష బాధ్యతలు చేపడితే.. తండ్రీ కొడుకులిద్దరూ రాష్ట్ర అధ్యక్షులుగా పని చేసినట్లవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇదో రికార్డు. మాధవ్ తండ్రి చలపతిరావు.. కాషాయ పార్టీకి తొలితరం నాయకుల్లో ఒకరు. ఆయన ఎమ్మెల్సీగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొలి బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఉన్న బీజేపీ సీనియర్ నేతలకు చలపతిరావు గురువులాంటి వారు. పీవీఎన్ మాధవ్ పూర్తి పేరు పోకల వంశీ నాగేంద్ర మాధవ్. 1973 ఆగష్టు 10వ తేదీన.. విశాఖ జిల్లా మద్దిలపాలెంలో జన్మించారు. మాధవ్ ఉన్నత విద్యావంతుడు. కాస్ట్ అకౌంటెంట్ కోర్సు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయలో చదివారు. ఆయన రాజకీయ ప్రయాణం అఖిల భారత్ విద్యార్థి పరిషత్‌తో ప్రారంభమైంది.

# జిల్లా మురళి జీవిత స్ఫూర్తితో కార్మిక సంఘాలు నిర్మిద్దాం

**- ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30**
ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు సీనియర్ నాయకుడు జెల్లా మురళి అమరత్వస్ఫూర్తితో కార్మిక సంఘాలను నిర్మిస్తామని ఐఎఫ్టియు నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు తెలిపారు. జెల్లామురళి సంతాపసభ నిజామాబాద్ నగరంలో ద్వారకా నగర్ ఐఎఫ్టియు ఆఫీసులో జిల్లా అధ్యక్షులు భూమన్న అధ్యక్షతన 30 జూన్ 25 న నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టుక మరణం సహజమే కానీ ప్రజల కోసం కార్మికుల కోసం అనునిత్యం ఆలోచించి పోరాడిన మురళన్న జీవితం మనకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. మురళి నిజామాబాద్ నగరంలో ప్రెస్సు, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, పేద ప్రజల ఇండ్ల స్థలాల కోసం పోరాడి కార్మికుల హృదయాల్లో పదిలంగా నిలిచారని ఆయన అన్నారు.కార్మికులు నరేంద్ర మోడీ పాలనలో కష్టాలతో ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికులు పోరాడి




సాధించుకున్న 44 చట్టాలు కనుమరుగై, కార్మిక వ్యతిరేక చట్టాలతో కార్మికులకు మరణ శాసనంగా మారిందని ఆయన తెలిపారు. దేశంలో 50 కోట్ల మంది కార్మికులు ఉంటే నేటికీ 43 కోట్ల మంది ఎలాంటి చట్టాలు లేక అతి తక్కువ వేతానాలతో, భయంతో బతుకులు గడుపు తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసి హక్కు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన అన్నారు. దేశంలో పెట్టుబడిదా రులకు అనుకూలంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని, ఎన్నికల్లో బిజెపి మోడీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆయన తెలిపారు.ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా గట్టిగా పోరాటమే చేయడమే మురళి నిజమైన నివాళి అని దాసు అన్నారు.జిల్లా ఉపాధ్యక్షులు సూర్య శివాజీ, నీలం సాయిబాబా, మల్లికార్జున్, జిల్లా



సహాయ కార్యదర్శులు శివకుమార్ జేపీ గంగాధర్ లు మాట్లాడుతూ మురళి త్యాగాన్ని, కొనియాడారు. పేదరికం, వెంటాడిన, కష్టజీవుల పక్షం నిలిచి కొట్లాడిన మురళి మనందరికీ మార్గదర్శి అని వారు తెలిపారు. ఐఎఫ్టియు అభివృద్ధి కోసం, అహర్నిశలు శ్రమించిన మురళి ఆశయ సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగుదామని, కేంద్ర రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దూరంగా పోరాడుదాం అని వారు పిలుపునిచ్చారు. ఈ సంతాప సభలో ఐఎఫ్టియునాయకులు దాల్మల్కి పోశెట్టి మోహన్, రాజు, భారతి, పద్మ,ఇమ్రాన్, రసూల్, శ్యామ్సున్ సత్యనారాయణ, చొప్పరి గంగాధర్, అరుణోదయ ప్రధాన కార్యదర్శి మురళిస్మరిస్తూ పాటలు వినిపించారు. సంతాప సభ ప్రారంభానికి ముందుగా మురళి నివాళి అర్పించి, మౌనం పాటించారు.

# అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటు

**- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్**




**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30 :**
సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ పసుపు బోర్డు ప్రారంభోత్సవం పేరుతో బిజెపి నాయకత్వం ఎన్నిసార్లు నిజామాబాద్ లో ప్రారంభం చేస్తుందని అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటై సంవత్సరం గడుస్తున్నా పసుపు బోర్డుకు కావలసిన చర్యలు చేపట్టకుండా గతంలో ప్రధాని మోడీ, ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి వర్యులు అమిత్ షా ప్రారంభచేస్తూ ప్రచారం చేసుకుంటున్నారని ఇప్పటికైనా పసుపు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. బిజెపి నాయకుల రాకకు ముందే అర్ధరాత్రి పూట కమ్యూనిస్టు పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు అని అన్నారు ఈ ప్రెస్ మీట్ లో సిపిఐ నగర కార్యదర్శి వై. ఓమయ్య, సిపిఐ నాయకులు బి.రఘురాం, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# డి శ్రీనివాస్ సేవలు మరువలేనివి

**- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30**
ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,మాజీ పిసిసి అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు, నిజామాబాద్ జిల్లాకు చేసిన అభివృద్ధి,సేవలు మరువలేనివని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం రోజున డి శ్రీనివాస్ విగ్రహ ఆవిష్కరణ చేసిన విషయం తెలిసిందే. జిల్లా కాంగ్రెస్ పార్టీ, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఆధ్వర్యంలో సోమవారం రోజున ధర్మపురి శ్రీనివాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం ధర్మపురి శ్రీనివాస్ స్వర్గస్తులైనప్పుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ కు వచ్చి డిశ్రీనివాస్ పైన కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పినట్టు గుర్తు చేశారు.తెలంగాణ పిసిసి అధ్యక్షుడిగా,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడిగా రాష్ట్రానికి, జిల్లాకు, కాంగ్రెస్ పార్టీకి ఎంతో కృషి చేశారాని అన్నారు.మాజీ మంత్రి షబ్బీర్



అలీ,మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ శోకసముద్రంలో ఉన్నప్పుడు సిఎం రేవంత్ రెడ్డి వచ్చి డిశ్రీనివాస్ కుటుంబాన్ని ఓదార్చారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి డి శ్రీనివాస్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని విన్నవించుకోగా, రాష్ట్ర ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు డి శ్రీనివాస్ తో సన్నిహితం ఏర్పడ్డాయని అన్నారు. ఆయన చాలా సున్నితమైన మనిషి అని, ఆయన సిద్ధాంతాలను, ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్



పిసిసి అధ్యక్షులుగా ఉండి కాంగ్రెస్ పార్టీకి దిశ నిర్దేశం చేశారని, రాజనీతి అనుభవజ్ఞుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, సహకార కార్పొరేషన్ చైర్మన్, డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఏం సి సి చైర్మన్ ముప్పగంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, శరత్, ఐ సి డి ఎం ఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయా రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, డిసిసి డెలికేట్ ధర్మ గౌడ్, రూరల్ యూత్ నాయకులు ఉమ్మాజీ నరేష్, నిజాంబాద్ రూరల్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, వివిధ గ్రామల గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

# డ్రాపౌట్ లు ఎక్కువగా ఉన్న బడులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30 :**
డ్రాపౌట్ లు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని సర్కారు బడులలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చొరవ చూపాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ సోమవారం మండల విద్యా శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. జూన్ 06 నుండి 12 వరకు నిర్వహించిన బడిబాట సందర్భంగా నూతనంగా నమోదైన ప్రవేశాల గురించి ఒక్కో మండలం వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల పాటు విద్యార్థులు ప్రవేశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ప్రభుత్వ బడులలో మెరుగుపడిన మౌలిక సదుపాయాలు, ఉత్తీర్ణత, భర్తీ అయిన టీచర్ల ఖాళీలు, నాణ్యమైన విద్యా బోధన, ఉచితంగా యూనిఫామ్ లు, టెక్స్ట్ బుక్కులు, నోట్ బుక్కులు సమకూరుస్తున్న విషయాల గురించి ఇంటింటికి వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయించాలని, ఈ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అవసరమైన బడులలో కిచెన్ షెడ్ లు వంటి వాటి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలల్లో చేరేలా పర్యవేక్షణ జరపాలని అన్నారు. పదవ తరగతి పూర్తి చేసుకుని పై చదువులలో చేరని వారిని గుర్తిస్తూ, ఒక్కో విద్యార్థి వారీగా పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ జరిగాయని, నోట్ బుక్కులు కూడా 80 శాతం వరకు పంపిణీ అయ్యాయని మిగతా వాటిని కూడా జిల్లాకు కేటాయించిన వెంటనే విద్యార్థులకు ఆయా పాఠశాలల వారీగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక జత ఏకరూప దుస్తులు ఇప్పటికే విద్యార్థిని విద్యార్థులకు అందించామని, రెండవ జత యూనిఫామ్ లను మహిళా స్వయం సహాయక సంఘాలు త్వరగా కుట్టించి ఇచ్చేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఈఓ అశోక్, ఎంఈఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజావాణిని కార్యక్రమానికి 28 ఫిర్యాదులు

**- పోలీస్ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి**

**- కమిషనర్ సాయి చైతన్య సూచించారు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30**
పోలీస్ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదిదారుల నుండి 28 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమీషనర్ సాయి చైతన్య స్వీకరించారు.నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు




దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల ఎస్.ఐ, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని వివరించి పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం, ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగిం చుకోవాలని తెలిపారు., వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత



దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమీషనర్ సాయి చైతన్య, స్పష్టం చేశారు.. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తు న్నామని తెలిపా రు. ఈ పోలీస్ ప్రజావాణి అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని నిజామా బాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలకు సూచించారు.

# దుబాయ్ లో ఘనంగా బోనాల పండుగ

**మెట్ పల్లి టౌన్ (మన వెలుగు) జూన్ 30 :**
ఆదివారం ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక మరియు సంక్షేమ సంఘం (ఈటిసిఎ) ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రజల ఆధ్యాత్మికతకు, భక్తి భావనకు ప్రతీక అయిన తెలంగాణ బోనాల పండుగను మైత్రి ఫార్మ్, అజ్మాన్ లో భక్తి శ్రద్దల నడుమ ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఇది ఈటిసిఎ ఆధ్వర్యంలో మూడవ బోనాల వేడుకగా జరగడం విశేషం.ఈ పండుగ కార్యక్రమం గౌరమ్మ పూజతో ప్రారంభమై, అనంతరం అమ్మవారి అలంకరణ ప్రత్యేకంగా నిర్వహించబడింది. సంప్రదాయబద్ధంగా దీపప్రజ్వలన చేసి, నివేద్యాలు సమర్పించారు. పట్టు చీరల్లో సాంప్రదాయ వేషధారణలో బోనాలు మోస్తూ మహిళలు ఊరేగింపు లో పాల్గొన్న దృశ్యాలు ఎంతో ఆకర్షణీయంగా నిలిచాయి. మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించడంతో పాటు, ఒడి బియ్యం సమర్పణ, అమ్మవారికి హారతి, మహిళలందరికీ వాయునం పంచడం విశిష్టంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 500 మంది హాజరై తమ సాంస్కృతిక పరంపరను సామూహికంగా గౌరవించారు. మహిళలు బోనాలతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించు కొని, బోనాల్ని సమర్పించి కుటుంబ శ్రేయస్సు, లోకకల్యాణం కోరుతూ ప్రార్థనలు చేశారు.



ప్రధాన ఆకర్షణలు: అమ్మ వారి మండపం , అలంకరణ భక్తి పారవశ్యంలో మునిగేలా చేసాయి. మహిళలు బోనాల ఎత్తుకొని సామూహికంగా కుటుంబాలతో నిర్వహించిన



ఊరేగింపు అందరిని ఆకట్టుకొంది.ఒగ్గు కథా బృందం ప్రదర్శించిన వినూత్న డప్పు విన్యాసాలు, నృత్యాలు అందరిని అలరించాయి. పోతరాజుల వేషధారణలు మరియు ప్రదర్శనలు కార్యక్రమానికి మరింత ఉత్తేజాన్ని నింపాయి.చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంప్రదాయ వంటలతో హాజరయిన వారి కోసం నిర్వాహకులు ఏర్పాటు చేసిన సామూహిక భోజనాలు తెలంగాణ ఊరు లో జరిగిన వాతావరణాన్ని గుర్తు చేసాయి.

# అత్యవసర సమయంలో రక్తదానం



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 30 :**
అన్నా అని పిలవగానే ఎప్పుడు మా వెన్నంటే ఉండి మాకు ఏదైనా సమస్య వస్తే ఎంత పనిలో ఉన్న పని వదులుకొని మాతో ఉండే మా ఆత్మీయ అన్నయ్య పగడల నవీన్ అన్న (అరుణ్ హెయిర్ కటింగ్) మెట్పల్లి నుండి హైదరాబాద్ వరకు వెళ్లి రక్తదానం చెయ్యడం జరిగింది. పట్టణానికి చెందిన ముత్యాల తరభయ్ హైదరాబాద్ పట్టణంలోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా అత్యవసర చికిత్స నిమిత్తం ఒ పాజిటివ్ రక్తం అవసరం అని డాక్టర్ చెప్పడంతో పేషెంట్ వాళ్లకు హైదరాబాద్ లో ఎవరు తెలియక డోనర్ కోసం ప్రయత్నిస్తూ ఉండగా పట్టణంలోని అరుణ్ హెయిర్ కటింగ్ నిర్వాహకుడు పగడల నవీన్ సమాచారం తెలుసుకొని మెట్పల్లి నుండి హైదరాబాద్ వరకు వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది.అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణధాతగా నిలిచిన పగడల నవీన్ ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, యువజన సంఘాల సభ్యులు, పేషెంట్ బంధువులు, స్నేహితులు అభినందించారు.

# నా ప్రతి అడుగు ప్రజా సంక్షేమం కోసమే.... ఎమ్మెల్యే పాయం....

**పినపాక (మన వెలుగు) జూన్ 30 :**
పినపాక నియోజకవర్గ సర్వతోము ఖాభివృద్ధి, నియోజకవర్గ ప్రజలం దరి సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు అంతకు మించి నేను ఏమి ఆలోచించను పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలం లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం విస్తృతంగా పర్యటిం చారు . అశ్వాపురం, తురుమల గూడెం గొల్లగూడెం, చింతిర్యాల, సంద్రల బోడు



గ్రామ పంచాయితీ లలో రూ. 50 లక్షలతో సీ సీ రోడ్లు ప్రారంభించారు. రూ. 2 కోట్లతో సంద్రలబోడు , చింతిర్యాల రహదారికి శంకుస్థాపన చేశారు. సంద్రల బోడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం బీ సీ హాస్టల్ ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాలు అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నానన్నారు. ప్రజలు తమ సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కా రానికి కృషి చేస్తానన్నారు. అర్హు లైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మణిధ ర్, ఎంపీడీవో ముత్యాలరావు, ఎం ఈ ఓ వీరస్వామి, ఏపీఎం సత్యనా రాయణ,ఏ ఈ లు చారి, కిషోర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఎస్సెస్సీ టాపర్లను సన్మానించిన ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30 :** పదవ తరగతి 2024 – 2025 వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులను జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు.





**బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ,**

ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదివరకటితో పోలిస్తే ప్రభుత్వ బడులలో ఉత్తీర్ణత ఎంతో మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో వచ్చే విద్యా సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ప్రత్యేకించి ప్రభుత్వ బడుల నిర్వహణ మెరుగయ్యేలా మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని, తమ సొంత ఇంటిని తీర్చిదిద్దుకునే విధంగానే సర్కారీ బడులలో ప్రమాణాలు మెరుగుపడేలా చొరవ చూపాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని బడులలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు. చక్కగా పనిచేసే వారిని తప్పనిసరిగా ప్రోత్సహిస్తామని, ప్రతి ఒక్కరు తమ విధులకు పూర్తి న్యాయం చేస్తూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.

**నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ,**

విద్యా, క్రీడ, పర్యాటక రంగాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ప్రతి పాఠశాలలో సౌకర్యాలు, విద్యా బోధన మెరుగుపడేలా కృషి చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సైతం ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీసుకునేలా తీర్చిదిద్దాలని అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వంటి వాటి బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో సీఎం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారని అన్నారు. చాలాకాలం నుండి పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఇటీవలే ప్రభుత్వం పూర్తి చేసిందని గుర్తు చేశారు.

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ,**

ఇదివరకటి రెండు సంవత్సరాలలో పోలిస్తే, ఈసారి పదవ తరగతిలో జిల్లాలో సగటు ఉత్తీర్ణత మెరుగుపడిందని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల సాధన కోసం ఇప్పటినుండే నాణ్యమైన విద్యా బోధనపై దృష్టిని కేంద్రీకరించాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. గణితం, ఆంగ్లం, సామాన్య శాస్త్రం వంటి సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులకు క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా వసతుల కొరత ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఎస్సెస్సీలో మెరుగైన ఫలితాల సాధన, అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు, నాణ్యమైన విద్యా బోధన గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు.

ఎస్సెస్సీలో 586 మార్కులు సాధించిన డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తోట రక్షితను అభినందిస్తూ ముఖ్య అతిథులు సత్కరించారు. అలాగే, 584 మార్కులు సాధించిన ఓరగంటి గంగాగోపాల్, గట్టు షైనీ, 582 మార్కులు పొందిన ఎస్.దీప్తి, డి.వైశాలి, 579 మార్కులు సాధించిన వై.కీర్తన, 577 మార్కులు సాధించిన అలేఖ్య, వై.గ్రీష్మ, జంగిటి అక్షరలను ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఘనంగా సన్మానించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పల్లికొండ, డొంకేశ్వర్, రాంపూర్, మెండోరా, అమ్రాద్, చౌట్పల్లి, జక్రాన్పల్లి, మోస్రా, కల్లెడి, రెంజల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరించారు. ప్రభుత్వ బడులలో అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన బోర్గం(పి) హైస్కూల్, బోధన్ రాకాసిపేట్ బాలికల ఉన్నత పాఠశాల, చిట్టాపూర్ ప్రైమరీ స్కూల్, తుంపల్లి ప్రైమరీ స్కూల్, ఫులాంగ్ బాలుర ఉచ్చతర ప్రాథమిక పాఠశాలల హెచ్.ఎంలను కూడా సత్కరించారు. సోమవారం నాటితో పదవీ విరమణ చేసిన ముగ్గురు ఎంఈఓలు, ముగ్గురు హెచ్.ఎం లను ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, ఎం.ఈ.ఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గజిటెడ్ హెచ్.ఎంలు, కాంప్లెక్ హెచ్.ఎంలు, ఎంఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 127 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్,



నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీ.డీ.రాజేందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన



చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ స్కూలు మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**- ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి అధ్వర్యంలో నారాయణ స్కూల్ ముందట ధర్నా**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30 :** ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని సుభాష్ నగర్ లో గల నారాయణ స్కూల్ ముందట దర్న నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘురాం అంజలి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు నారాయణ విద్యాసంస్థల




ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. దాంట్లో భాగంగానే నిజామాబాద్ నగరంలోని నారాయణ స్కూల్ ముందట ధర్నా నిర్వహిస్తూ నారాయణ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను జలగల్లేక్క రక్తం పిలుస్తూ వేల కొద్ది రూపాయలు ఫీజులు రూపంలో వసూలు చేస్తున్నారు. అదే కాకుండా స్టేషనరీ పేరు తోటి ఒక విద్యార్థి దగ్గర 21 వేల రూపాయలు వసూలు చేస్తున్నటువంటి పరిస్థితి ఉంది వెంటనే దీని పైన విద్యాశాఖ అధికారులు స్పందించి నారాయణ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని దాంతోపాటు ఫీజు నియంత్రణ చట్టం అమలు అయ్యే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు డిమాండ్ చేశారు. తక్షణమే నారాయణ విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపు ఇస్తామని అన్నారు. ఈ దర్న కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కుషాల్, నాయకులు నవీన్ కృష్ణ ,టోకు,లక్ష్మణ్ ,రమేష్,దినేష్,తదితరులు పాల్గొన్నారు.

# బెదిరింపులకు పాల్పడిన ముగ్గురు విలేకరుల అరెస్టు

**- రైతు వద్ద 50 వేల నగదు డిమాండ్, 30 వేల రూపాయల వసూలు చేసిన విలేకరులు**
**- అప్పు తెచ్చి విలేకరులకు డబ్బులు చెల్లించిన రైతు**
**- రైతును బెదిరించి, భయపెట్టి వసూళ్లకు పాల్పడిన ముగ్గురు నేరడిగొండ విలేకరులు**
**- రూ 1800 నగదు స్వాధీనం**

**బోథ్ (మన వెలుగు) జూన్ 30 :**



ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు మరియు బాధితుడు టగరే కాసాన్ దాస్ న్యాల్ సింగ్, సుర్జాపూర్ గ్రామం నేరడిగొండ గ్రామానికి చెందిన వ్యక్తి. ఇంట్లో తన కూతుర్ల పెళ్లిలు ఉండడంతో పండిన జొన్న పంటను దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్కూలు ఆవరణలో ఆరబెట్టుకోవడం గమనించిన ఈ ముగ్గురు విలేకరులు మే 18 వ తారీఖున బాధితున్ని బెదిరించి నీపై ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని భయపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని ఎవరికీ తెలియకుండా ఉండడానికి రైతు వద్ద 50 వేల రూపాయలను అడగడంతో, దీంతో భయపడిన రైతు 30 వేల రూపాయలను ముగ్గురికి అందజేయడం జరిగిందని తెలిపారు. రైతుని భయపెట్టి బెదిరించి బలవంతంగా అతని వద్ద నుండి 30 వేల రూపాయల నగదును తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కారణంగా ఈ ముగ్గురు వద్ద నుండి రూ 1800 రూపాయల నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఈరోజు ఈ ముగ్గురిని అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానం అనుమతితో రిమాండ్కు పంపడం జరిగిందని తెలిపారు. బలవంతంగా బెదిరింపులకు పాల్పడుతున్న ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా జిల్లా పోలీసు యంత్రంగా కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేరేడుగొండ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కంజర్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30 :** మోపాల్ మండలం కంజర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో చేపట్టిన పనుల గురించి ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి




తెలుసుకున్నారు. రూ. 11.20 లక్షల నిధులు మంజూరు కాగా, తాగునీటి వసతి, విద్యుత్, ఫ్లోరింగ్ తదితర ప్రతిపాదిత పనులన్నీ పూర్తి అయ్యాయని హెచ్.ఎం గోపాలచారి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇంకా ఏమైనా వసతులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ అశోక్, ఎంపీడీఓ రాములు తదితరులు ఉన్నారు.

# కారు చక్రాల్లో నలిగిపోయిన ఏడేళ్ల బాలుడు

**- ఆడుకుంటున్న బాలుడు పై కారు ఎక్కించిన డ్రైవర్**
**- తీవ్రంగా గాయపడిన బాలుడిని ఆసుపత్రికి తరలించిన స్థానికులు**
**- సీసీ కెమెరాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30**





నిజామాబాద్ నగరంలోని ముజాహిద్ నగర్ లో ఏడేళ్ల బాలుడు కారు చక్రాల కింద పడి నలిగిపోయాడు ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ముజాహి నగర్ కు చెందిన బాలుడు ఖయ్యూం (7) రోడ్డుపైన మరికొందరు బాలులతో ఆటాడుకుంటుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి బాలుడి పైనుంచి తీసుకెళ్లడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించారు. ఖయ్యుమ్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. బాధితులు ఈ మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సిసి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. బాలుడి మృతికి కారణమైన కారు ప్రముఖ ఫూట్ వ్యాపారి సంబంధించినదిగా గుర్తించారు. వ్యాపారి తనయుడు నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మరణించినట్టు స్థానిక యువకులు ఆరోపిస్తున్నారు. కేసును సెటిల్ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

## ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్గుల్ రజక సంఘ సభ్యులు

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30 :** నిజామాబాద్ రూరల్ క్యాంపు కార్యాలయంలో నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి ని జక్రాన్ పల్లి మండలం అర్బన్ గ్రామానికి చెందిన రజక సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి కి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రజక సంఘ అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ



నిజామాబాద్ రూరల్ నియోజవర్గం జక్రన్ పల్లి మండలం ఆర్గుల్ గ్రామంలో సంఘ భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవానికి రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆహ్వానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్రాన్ పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి,రజక సంఘ ఉపాధ్యక్షులు సుధాకర్, సభ్యులు ప్రభాకర్,గంగాధర్ నారాయణ,జైపాల్ మైపాల్, రాజు శివకుమార్ శ్రీనివాస్ స్వామి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

**- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొల్లం జ్యోతి**

**హైద్రాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 30** ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మేడి పాపన్న



మాదిగ గారి ఆదేశానుసారం జూలై 7వ తారీకున జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లా నియోజకవర్గ మండల గ్రామస్థాయిలో నిర్వహించాలని నల్గొండ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రామంజి సైదులు మాదిగ అన్నారుఅనంతరం స్థానిక మిర్యాలగూడ లో జరిగిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు, అందులో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జిగా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామానికి చెందిన చీమలపాటి వెంకటయ్య మాదిగను నియమించడం జరిగింది, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కందుల పెద్ద సైదులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకపంగు కాశయ్య మాదిగ నల్గొండ నియోజకవర్గ ఇంచార్జ్ పుల్లెంల ఏడుకొండలు మాదిగ, బొజ్జ ఆనోకు బలుగూరి పౌలు నూక పొంగు శ్రీనివాస్, అందువుల లక్ష్మణ్, దాసరి నాగరాజు, నూక పొంగు కృష్ణ, చింతల సైదులు, కొండేటి మధు, తదితరులు పాల్గొన్నారు.




# ఆలస్యంగా వస్తోన్న నికితా రాయ్

అతీంద్రియ శక్తులతో పోరాడుతూ 'నికితా రాయ్'గా ప్రేక్షకుల ముందుకు రావడానికి సన్నద్ధమవుతోంది బాలీవుడ్ కథానాయిక సోనాక్షి సిన్హా. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ హారర్ చిత్రాన్ని ఖుష్ సిన్హా తెరకెక్కించారు. ఈ సినిమా రాకకు ఆలస్యం కానున్నట్లు తెలుపుతూ... ఇన్‌స్టా వేదికగా కొత్త విడుదల తేదీని పంచుకుంది సోనాక్షి. "ఈ మధ్య కాలంలో చాలా సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వాటన్నింటి మధ్య మేమెంతో ప్రత్యేకంగా తీర్చిద్దిన 'నికితా రాయ్' చిత్రాన్ని విడుదల చేయాలనుకోవట్లేదు. అందుకే వచ్చే నెల 18కి మా సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నాం. ఇప్పటి వరకు మీరు మా సినిమాపై చూపిన అపారమైన ప్రేమకు ధన్యవాదాలు. 'నికితా రాయ్' కోసం మరికొంత కాలం వేచి ఉండండి" అని పేర్కొంది. పరేశ్ రావేల్, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# 30వేలకి పైగా పైరసీ సైట్లలో కన్నప్ప.. 'హార్ట్ బ్రేకింగ్' అంటూ మంచు విష్ణు ట్వీట్



మంచు విష్ణు నటించిన లేటెస్ట్ తెలుగు మైథలాజికల్ యాక్షన్ మూవీ 'కన్నప్ప'. ఈ మూవీ జూన్ 27న రిలీజై ప్రేక్షకులను అలరిస్తోంది. ఈ క్రమంలోనే కన్నప్ప మూవీ పైరసీ బారిన పడింది. నేడు (జూన్ 30న) కన్నప్ప పైరసీపై విచారం వ్యక్తం చేస్తూ 'హార్ట్ బ్రేకింగ్' అని విష్ణు ట్వీట్ చేశాడు.



'ప్రియమైన సినిమా ప్రియులారా, కన్నప్ప పైరసీ దాడిలో ఉంది. ఇప్పటికే 30,000కి పైగా అక్రమ లింక్‌లను తొలగిస్తూ చర్యలు తీసుకున్నాం. పైరసీ అంటే దొంగతనం. స్పష్టంగా చెప్పాలంటే.. పిల్లలకు దొంగతనం చేయొద్దని ఎలానైతే నేర్పిస్తామో.. అలాగే, పైరసీ కంటెంట్ చూడొద్దని చెప్పడం ఒక్కటే. దయచేసి పైరసీని ప్రోత్సహించవద్దు. సినిమాను సరైన మార్గంలో సపోర్ట్ చేయండి. హర్ హర్ మహాదేవ్'అని విష్ణు పోస్ట్ పెట్టారు.అయితే, భారతీయ కాపీరైట్ చట్టాల ప్రకారం, పైరేటెడ్ కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేయడం లేదా స్ట్రీమింగ్ చేయడం వల్ల రూ. 2 లక్షల వరకు జరిమానాలు విధించవచ్చు మరియు జైలు శిక్ష కూడా విధించవచ్చు.వాస్తవానికి, కన్నప్ప మూవీ విడుదలైన కొన్ని గంటల్లోనే పైరసీ బారిన పడింది. సినిమా యొక్క పైరేటెడ్ కాపీలు Tamilrockerz, Filmyzilla, Movierulez మరియు టెలిగ్రామ్ ఛానెల్‌లతో సహా అక్రమ సైట్‌లలో అప్‌లోడ్ చేయబడింది. ఈ వెర్షన్‌లు HD 1080p నుండి తక్కువ-రిజల్యూషన్ 240p వరకు ఉన్నాయి.ఏదేమైనా కన్నప్ప లాంటి చారిత్రక ఇతిహాస గాథను థియేటర్లో చూసి ఆనందించడం ఉత్తమం. కన్నప్ప మూవీ మూడు రోజుల్లో ఇండియా వైడ్ గా రూ.22.53 కోట్లు నెట్ వసూలు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్ల గ్రాస్ మార్కును దాటినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.

# శని పోయింది.. కన్యారాశికి టైమ్ వచ్చింది!


తరుణ్ భాస్కర్

తరుణ్ భాస్కర్ దర్శకత్వం నుంచి వచ్చిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమా యువతరాన్ని అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన ఈ చిత్రానికి కొనసాగింపుగా 'ఈఎన్ఈ రిపీట్' పేరుతో ఓ సినిమాని సిద్ధం చేస్తున్నారు. తొలి భాగంలో ప్రధాన పాత్రధారులుగా చేసిన విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమాను ఈ సీక్వెల్‌లోనూ సందడి చేయనున్నారు. డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు "ఏలినాటి శని పోయింది. కన్యారాశికి టైమ్ వచ్చింది" అనే ట్యాగ్‌లైన్‌తో ఓ ప్రచార చిత్రాన్ని పంచుకున్నారు. ఇది తొలి భాగాన్ని మించిన రెట్టింపు వినోదంతో ముస్తాబు కానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే చిత్రీకరణ మొదలు కానుంది. ఈ సినిమాకి సంగీతం: వివేక్ సాగర్, ఛాయాగ్రహణం: ఎజె ఆరోన్.

# అదిరిపోయేలా హరిహర వీరమల్లు ట్రైలర్



కింగ్‌డమ్ మూవీ చూసాక చెప్పంది హైట్ క్రియేట్ చేసిన నిర్మాత నాగవంశీ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తొలిసారి నటిస్తున్న పిరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరి హర వీరమల్లు' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. తొలుత జూన్ 12న విడుదల కావాల్సిన ఈ చిత్రం, కొన్ని కారణాల వల్ల జూలై 24కు వాయిదా పడింది. అయితే ఈ లోపు అభిమానుల్లో ఉత్సాహం పెంచేందుకు జూలై 3న ట్రైలర్‌ని విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.అయితే ఈ ట్రైలర్‌పై నిర్మాత నాగవంశీ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.మీరు ఏమి ఊహిస్తున్నారో నాకు తెలియదు? కానీ జూలై 3న రండి. మీకో పెద్ద సర్‌ప్రైజ్ ఉంది!హరిహర వీరమల్లు ట్రైలర్ అసాధారణంగా ఉంటుంది. మీరు గతంలో ఎప్పుడు పవన్‌ని చూడని విధంగా చూస్తారు.అంతేకాదు దానిని ఫీల్ అవుతూనే దానిని గురించి చర్చిస్తారంటూ హైప్ క్రియేట్ చేశారు. ఈ వ్యాఖ్యలతో ఫ్యాన్స్ లో ట్రైలర్‌పై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పవన్ కళ్యాణ్ యాక్షన్, డైలాగ్ డెలివరీ, స్క్రీన్ ప్రెజెన్స్ ఎలా ఉంటుందో చూడాలని వారు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. పవన్ కళ్యాణ్ ఇందులో ఓ పోరాట యోధుడి పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మ్యూజిక్ డైరెక్టర్ గా ఎం.ఎం. కీరవాణీ సంగీతాన్ని అందిస్తున్నారు. షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తయిన ఈ సినిమా జూలై 24న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్, గ్రాండ్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా, తెలుగు ప్రేక్షకులకే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించనుంది. మరోవైపు నిర్మాత నాగ వంశీ తాజాగా విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' సినిమా గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పై సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై నాగ వంశీ స్పందిస్తూ..'కింగ్‌డమ్‌కు సంబంధించి ఏ పోస్ట్ చేసినా ట్రోల్స్ వస్తున్నాయనేది నిజం. కాకపోతే నన్ను నమ్మండి? సినిమా విడుదలయ్యాక, వెండితెరపై అద్భుతం చూపించేందుకు మా టీమ్ ఎంతో కష్టపడుతోంది. ఈ మూవీ చూసిన తర్వాత మీరు ఫీల్ అయ్యే అనుభవం అసాధారణంగా ఉంటుంది అని తెలిపారు.

# మేం కలిసి నటించడానికి సిద్ధంగా ఉన్నాం


ఆమిర్ ఖాన్


"మేం ముగ్గురం కలిసి సినిమా చేయడానికి చాలా ఆసక్తిగా ఉన్నాము. సరైన కథ మా ముందుకు రావాలి. అది వస్తే మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తా"మంటున్నారు బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన రాబోయే ప్రాజెక్టులు, సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ..సరైన స్క్రిప్ట్ వస్తే షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్‌లతో ఓ సినిమా చేయడానికి ఆసక్తిగా ఉన్నానని వెల్లడించారు. తాను సల్మాన్‌తో కలిసి నటించిన కల్ట్ కామెడీ చిత్రం 'అందాజ్ అప్నా అప్నా'కి సీక్వెల్ రాబోతుందని ప్రకటించారు. ఈ సిక్వెల్ కోసం రాజ్ సంతోషి స్క్రిప్ట్‌ను రూపొందిస్తున్నారని, అన్నీ సవ్యంగా జరిగితే సీక్వెల్ చూసే అవకాశం ఉందని అన్నారు. చిత్రీకరణకు సన్నాహాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు హీరోలు ఏ జానర్‌లో నటిస్తున్నారనే ప్రశ్నకు.. మా ముగ్గుర్నీ కామెడీ జానర్‌లో చూడటానికే ప్రేక్షకులు ఇష్టపడుతున్నారని చెప్పారు ఆమిర్. ఇటీవల విడుదలైన ఆమిర్ ఖాన్ 'సితారే జమీన్ పర్' బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతూ ప్రేక్షకుల నుంచి ఆదరణ పొందుతోంది.

# సెంటిమెంట్‌తో పాటు ఎమోషన్స్ తమ్ముడు చిత్రంపై దర్శకుడు శ్రీరామ్ వేణు



సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ 'తమ్ముడు'. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'తమ్ముడు' సినిమా జూలై 4న వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను డైరెక్టర్ శ్రీరామ్ వేణు వివరించారు. 'తమ్ముడు' సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు డిఫరెంట్ లేయర్స్ ఉంటాయి. ట్రైలర్ లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం. సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దు అనుకున్నాం. ఒప్పుకుంటే యు బై ఎ సర్టిఫికెట్ ఇచ్చేవాళ్లు. సినిమాలోని ఎస్సెన్స్ ను సరిగ్గా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలనే కట్స్ లేకుండా ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఇది మా అందరి ఉమ్మడి నిర్ణయం. దిల్ రాజు గారు ఒక్కరే ఈ డెసిషన్ తీసుకోలేదు. సినిమాలో అంతగా హింస లేదు. ఈ కథలో హీరోతో పాటు ఐదుగురు లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, దిత్య ముఖ్యమైన పాత్రలు చేశారు. హీరో అంటే ఇంత లెంగ్త్ ఉండాలి అనేది 'తమ్ముడు'లో ఉండదు. హీరోతో పాటు ఐదుగురు వుమెన్ క్యారెక్టర్స్ బలంగా ఉంటాయి. 'తమ్ముడు' కథ విని దిల్ రాజు గారు బ్జడెట్ గురించి ఆలోచించకుండా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. తమ్ముడు' ప్రమోషన్స్ లో అందరూ పాల్గొంటున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ బిజీ వల్ల నేను ఎక్కువగా పార్టిసిపేట్ చేయలేకపోతున్నా. ప్రమోషన్స్ కు డైరెక్టర్స్ లీడ్ తీసుకోవడం అనేది ఇప్పుడు ట్రెండ్ గా మారింది. మేమూ అదే ఫాలో అవుతున్నాం. ఒక గర్వం నిలబడటానికి జరిగిన యుద్ధమే తమ్ముడు మూవీ. బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ప్రధానంగా కథలో ఉన్నా అనేక లేయర్స్ తో మూవీ సాగుతుందని వివరించారు.

# అల్లరి నరేశ ఆల్కహాల్ మూవీ




టాలీవుడ్‌లో మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్టుల్లో అల్లరి నరేష్ కూడా ఒకరు. నటన పరంగా ప్రాణం పెట్టి ప్రేక్షకులకి మంచి వినోదం పంచేందుకు ఎంతో ప్రయత్నిస్తుంటారు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగలడు ఈ అల్లరోడు. ఒకప్పుడు కామెడీ సినిమాలే చేసిన అల్లరి నరేష్ ఇప్పుడు జానర్ మార్చి సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడు అల్లరి నరేష్ తన 63వ సినిమాతో బిజీగా ఉండగా, ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. అల్లరి నరేష్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను విభిన్న కథలతో విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఇది అల్లరి నరేష్ కెరీర్‌లో 63వ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ రోజు అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా, సినిమా యూనిట్ టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్‌లో నరేష్ ఆల్కహాలిజం లో మునిగి పోయినట్టుగా కనిపిస్తున్నారు. ఇది ఒక భ్రమ, వాస్తవికత మధ్య నడిచే కథ అని అర్థమవుతోంది. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, ఫార్ట్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివిధ భావోద్వేగాలతో నిండి ఉండే ఈ సినిమా, అల్లరి నరేష్‌కి మరో హిట్‌గా నిలవనుందని సినీ వర్గాలు ఆశిస్తున్నారు.ఇక ఈ రోజు అల్లరి నరేష్ బర్త్ డే కాగా, ఆయనకి సోషల్ మీడియాలో అభిమానుల నుండే కాక సినీ ప్రముఖుల నుండి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.